శ్మశాన వాటిక దారి సమస్య పరిష్కారం

గుర్రంకొండ : ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో గుర్రంకొండలో హిందూ శ్మశాన వాటికకు 14 ఏళ్లుగా నెలకొన్న దారి సమస్య పరిష్కారమైంది. ఇటీవల ఎమ్మెల్యే స్థానిక ఇందిరమ్మ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు శ్మశాన వాటిక దారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్పందించిన అధికారులు గురువారం కడప–బెంగుళూరు జాతీయ రహదారి నుంచి కాలనీ లోపల ఉన్న శ్మశానం వరకు జేసీబీలతో దారిని ఏర్పాటు చేశారు. అదే విధంగా కాలనీ లోపల నుంచి వెళ్లే దారిని కూడా బాగు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సత్రీన్ ముక్తియార్, ఎంపీపీ యోగేంద్ర, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్ అక్కడికి చేరుకొని పనులను పర్యవేక్షించారు. శ్మశాన వాటికకు అవసరమైన సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని మండల పరిషత్ నిధుల ద్వారా చేపడతామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెడ్డెమ్మకొండ పాలకమండలి సభ్యులు నక్కామధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గణేష్, రమేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

కూలీల అవసరాల మేరకు పనులు


సామాజిక తనిఖీ బహిరంగ సభలో పీడీ మద్దిలేటి

పీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల అవసరాల మేరకు పనులు కల్పిస్తామని పీడీ మద్దిలేటి అన్నారు. గురువారం స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయం ఆవరణలో పీడీ అధ్యక్షతన ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరును కరువు మండలంగా ప్రకటించడంతో పని దినాలు ఎక్కువ ఉంటాయని, కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఉపాధిలో పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపాలని కోరారు. అనంతరం గ్రామాల వారీగా సామాజిక తనిఖీ సిబ్బంది నివేదికలు చదివి వినిపించారు. తరువాత పీడీ మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి సంబంధించి మండలంలో రూ.8.13 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ప్రకాష్, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, ఏపీవో మహేష్, ఎస్ఆర్పీ చంద్రమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటకు డీబీటీ లబ్ధి రూ.109 కోట్లు

- నాన్ డీబీటీ ద్వారా మరో రూ.46 కోట్లు
- అభివృద్ధి పథంలో నగర పంచాయతీ
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తోందని, ఇందులో భాగంగా బి.కొత్తకోటకు మాత్రమే వివిధ పథకాల ద్వారా ప్రజలకు రూ.109.34 కోట్లు అందించడం జరిగిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గురువారం బి.కొత్తకోట నగర పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శెట్టిపల్లె, జనుపవారిపల్లె, ఊజార్లపల్లె, ఎద్దులవారిపల్లె, ఆలేటివారిపల్లె, చంద్రమాకులపల్లె, ఎగువ చంద్రమాకులపల్లె, నక్కరాజుపల్లె, అయ్యవారిపల్లె, డేగానిపల్లె, తాకాటంవారిపల్లె, బాలసానివారిపల్లె, బద్దిపల్లెల్లో ఇంటింటికీ వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. వారు ప్రభుత్వం ద్వారా కలిగిన ఆర్థిక లబ్ధి, సమస్యల పరిష్కారంతో మెరుగైన మౌలిక వసతులపై ఎమ్మెల్యేకు వివరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 24 వేల ఓటర్లు కలిగిన బి.కొత్తకోట నగర పంచాయతీలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు రూ.109.34 కోట్లను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అందించడం జరిగిందన్నారు. ఒక నగర పంచాయతీ పరిధిలో మాత్రమే ఈ స్థాయిలో సంక్షేమం జరగడం గత ప్రభుత్వాలు చేశాయా అని ప్రశ్నించారు. ఇదే కాక నాన్ డీబీటీ ద్వారా నగర పంచాయతీ ప్రజలకు రూ.46.37 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. నగర పంచాయతీలో రూ.32.22 కోట్లతో అభివృద్ధి పనులు, మౌళిక వసతులు కల్పించామని చెప్పారు. గతంలో కంటే ప్రస్తుతం బి.కొత్తకోట అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు.

దివ్యాంగురాలికి సొంతంగా పింఛన్

ఎగువ చంద్రమాకులపల్లెకు చెందిన 35 ఏళ్ల మానసిక దివ్యాంగురాలు పి.అశ్వర్థమ్మకు ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరుకు సాంకేతిక సమస్య అడ్డంకిగా మారిందని పర్యటనలో తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించారు. ఆమెకు ప్రభుత్వ పింఛన్ మంజూరయ్యే వరకు తానే సొంతంగా ప్రతినెలా రూ.2,500 ఇస్తానని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ పీఆర్.మనోహర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, హౌసింగ్ డీఈ శ్రీహరిరావు, బిల్డింగ్ సొసైటీ చైర్మన్ బలరాంరెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ జీవీ రామకృష్ణ, నగర, పట్టణ జేసీఎస్ కన్వీనర్లు మోహన్‌బాబు, చిన్నికృష్ణ, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు మాలిక్, జాబీర్, మధు, సీహెచ్‌సీ కమిటి సభ్యులు కంచి కళ్యాణ్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న వస్తేనే సంక్షేమ పథకాలు

- టీడీపీ వస్తే రద్దు చేస్తారు
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


గడప గడపకు మన ప్రభుత్వం క్యాక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ : రాష్ట్రంలో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఇప్పుడిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నింటినీ రద్దు చేస్తారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం గుర్రంకొండ రెండవ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీధుల్లో మురుగునీటి కాలువలు నిర్మించాలన్నారు. అర్హులైన తమకు వైఎస్సార్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కాలనీలోని పలు వీధుల్లో సిమెంటు రోడ్లు నిర్మించాలని పేర్కొన్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఎంత అప్పుల్లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని సంక్షేమ పథకాలను ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మంచి మనసున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీల కంటే ఎక్కువే చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సత్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ సుదీర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్, అప్పల్ల, మాజీ ఎంపీపీ జమీర్, సర్పంచ్‌లు రౌనఖ్ బాషా, యల్లారెడ్డి, ఎంపీటీసీలు సరస్వతి, ఖాదిర్, రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సురేష్, ప్రకాష్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గణేష్, నక్కా మధు, జ్యోతిరెడ్డి, హౌస్‌ఫెడ్ కార్యదర్శి గయాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముందస్తు సంక్రాంతి సంబరాలు


ముందస్తు సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ముత్యాల ముగ్గులు, మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా శుక్రవారం మధ్యాహ్నం జెడ్పీ హైస్కూల్ మైదానంలో సంక్రాంతి శోభ వెల్లివిరియనుంది. ప్రభుత్వశాఖలు, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న సంక్రాంతి ముందస్తు సంబరాల్లో పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్. మురళీ తెలిపారు. గురువారం జెడ్పీ హైస్కూల్ మైదానంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. సంక్రాంతి అంటే అచ్చమైన పల్లె పండుగని, మనవైన సంప్రదాయాలు, సంస్కృతుల్ని ప్రతిబింబించే సప్తవర్ణాల వేడుకన్నారు. మనుషులు, మూగజీవాల మధ్య ఉండే అనురాగాలు, అనుబంధాలకు ప్రతీకగా అభివర్ణించారు. నాలుగురోజుల పాటు వేడుకగా జరిగే ఈ పండుగ సంబరాలను నేటితరం మరచిపోకుండా, వాటిని గుర్తు చేసేందుకు తమవంతు ప్రయత్నంగా ముందస్తు సంబరాల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జెడ్పీ హైస్కూల్ మైదానంలో సంక్రాంతి సంబరాల్లో వ్యవసాయ సామగ్రి, ఎడ్లబండ్లు, గడ్డివాములు, పశుసంపద, కులవృత్తుల వారితో పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముందస్తు సంక్రాంతి సంబరాలకు హాజరయ్యే వారు సంప్రదాయ దుస్తుల్లో రావాలని, గోపూజ నిర్వహణతో పండుగ సంబరాలను ప్రారంభిస్తామని తెలిపారు. సంబరాలకు పెద్దసంఖ్యలో పట్టణ ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వీఎస్ఆర్ గ్రాండ్స్ సుధాకరరెడ్డి, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, పూలనాగరాజ, లాయర్ బాలజ్యోతి, బాలగంగాధరరెడ్డి, భాగ్యలక్ష్మి, బ్రహ్మకుమారీస్ పద్మావతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీపీఓ ధనలక్ష్మి

మదనపల్లె : గ్రామీణ ప్రాంత యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తోందని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. గురువారం జెడ్పీహైస్కూల్ మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా సంబరాలను ఆమె పర్యవేక్షించారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా రెండోరోజైన గురువారం వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, పీడీ దేవకి, శివశంకర్, సర్పంచ్ శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : రేణుమాకులపల్లె ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. 8 జట్లు పాల్గొన్నాయి. కొటాల, ఎద్దులవారిపల్లె, కోటకొండ, తంబళ్లపల్లె జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నట్లు పీడీ మొగల్‌ఖాదర్‌బాషా తెలిపారు. కన్నెమడుగు ఉన్నత పాఠశాల మైదానంలో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరిగాయి. కార్యక్రమాలలో హెచ్ఎంలు రమేష్, మదన్మోహన్, పీఈటీలు చలపతిరెడ్డి, రాజీవ్, లత, పంచాయతీ కార్యదర్శులు సాకెమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీపీ నరసింహులు పరిశీలించారు. ఎంపీడీఓ శేషగిరిరావు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అంజద్అలీఖాన్, పీడీ భద్రయ్య పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'పీలేరు'

పీలేరు రూరల్ : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ వెంకటాద్రి ఇళ్ల వద్ద రెండు రోజుల పాటు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాజంపేట పార్లమెంటరీ కన్వీనర్ యం.చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ క్రికెట్ టోర్నమెంట్‌లో పీలేరు రెడ్డి టీము విజేతగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం బహుమతుల ప్రదానం చేశారు. పీలేరు రెడ్డి టీమ్‌కు మొదటి బహుమతి రూ.13 వేలు, ద్వితీయ బహుమతి అగ్రహారానికి చెందిన చైతన్య టీమ్‌కు రూ.9 వేలు, మూడో బహుమతి ఎంజేఆర్ చైతన్య టీమ్‌కు రూ.5 వేలు, నాలుగో బహుమతి సొరకాయలపేట జట్టుకు రూ.4 వేలు చాన్‌బాషా అందజేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె మండలాలకు చెందిన క్రీడాకారులు, వైఎస్సార్‌సీపీ నాయకుల సయ్యద్, దావూద్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కరణం సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ : మదనపల్లె రచయితల సంఘంకు కరణం బాలసుబ్రమణ్యం పిళ్లై ఎనలేని సేవలు అందించారని ప్రముఖ రచయిత, ఆచార్య చంద్రశేఖరశర్మ అన్నారు. గురువారం స్థానిక మరసం కార్యాలయంలో ప్రముఖ రచయిత కరణం బాలసుబ్రమణ్యంపిళ్లై సంస్మరణ సభ నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మరసం అధ్యక్షులుగా పని చేసిన కరణం యువ రచయితలకు ఆదర్శంగా నిలిచారన్నారు. మదనపల్లె రచయితలకు గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మరసం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి, రచయితలు నాగరాజు, ప్రసన్నలక్ష్మి, కుమారస్వామి, శరత్ బాబు, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల నిరసన

మదనపల్లె : కేంద్ర ప్రభుత్వం ఐపీసీ స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన భారత న్యాయ సంహిత చట్టంలో హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్లపై జైలు శిక్షను పెంచడాన్ని నిరసిస్తూ పట్టణంలోని లారీ డ్రైవర్లు ధర్నా చేపట్టారు. గురువారం బసినికొండ వై జంక్షన్ శ్రీకృష్ణదేవరాయ సర్కిల్, అనంతపురం–కృష్ణగిరి జాతీయ రహదారిని నిర్బంధించి నిరసన తెలిపారు. జయహో రథసారధి డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త డ్రైవర్స్ బంద్‌లో భాగంగా స్టీరింగ్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జింకా చలపతి, యస్.మక్బూల్, జాయింట్ సెక్రటరీ ఫరీద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కొత్త చట్టంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ మార్గం.. అనుసరణీయం

నిమ్మనపల్లె : దేశప్రజలందరికీ సమాన హక్కులు లభించాలని కృషి చేసిన డాక్టర్.బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా సూచించిన మార్గాన్ని ప్రజలందరూ అనుసరించాలని మదనపల్లె డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. గురువారం మండలంలోని 12 సచివాలయాల్లో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమ్మనపల్లె సచివాలయం వద్ద జరిగిన సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈనెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభిస్తున్న నేపథ్యంలో అందులో పాల్గొనేందుకు సచివాలయం నుంచి ఐదుగురిని ఎంపిక చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచు పాపులమ్మ, మల్లప్ప, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, రాజేష్, నాయకులు శ్రీనివాసులు, రమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కొత్త కమిటీ


శ్రీనివాసులురెడ్డి   వెంకటేష్

మదనపల్లె : మదనపల్లె వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీని నియమిస్తూ అగ్రికల్చరల్ మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, చైర్మన్‌గా తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్‌గా మన్నవరం రామచంద్ర వెంకటేష్‌బాబు(బోర్‌వెల్ వెంకటేష్)ను నియమించారు. కమిటీ సభ్యులుగా బి.లక్ష్మీదేవి, ఏ.వి.అపర్ణ, సి.సుమ, సీ.పీ.రమణప్ప, సి.బయన్న, ఎన్.జయమ్మ, బి.శంకర్‌నాయక్, మేకల రేణుక, జి.రెడ్డెమ్మ, రెడ్డిపల్లి ఆశా, షేక్‌ప్యారేజాన్, ఎస్.మహదేవరెడ్డి, తిరుమలరెడ్డిగారి గంగుల్‌రెడ్డి, మదనపల్లె పీఏసీఎస్ అధ్యక్షులు, జిల్లా అగ్రికల్చరల్ ట్రేడ్, మార్కెటింగ్ ఆఫీసర్, మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌ను నియమించారు. నూతన కమిటీ పదవీకాలాన్ని ఒక సంవత్సరంగా నిర్ణయించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

మదనపల్లె సిటీ : స్థానిక పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం మెకోరో టెక్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇందులో ఈఈఈ, ఈసీఈ విభాగాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. 9 మంది ఎంపికయ్యారు. వీరిని కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

ఇంధనం పొదుపు.. ఆదాయం పెంపు

పీలేరు రూరల్ : ఆర్టీసీలో ఇంధనం పొదుపు చేస్తే ఆదాయం పెరుగుతుందని డీఎం కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో మెరుగైన ఫలితాలు సాధించిన సిబ్బందికి నగదు అవార్డులతో ప్రోత్సహించినట్లు తెలిపారు. బెస్ట్ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్ బీఆర్సీ నాయక్‌కు, అత్యధిక ఇంధనం పొదుపు సాధించిన జి.గంగయ్యకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్యారేజీ ఎంఎఫ్ హరినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి

పీలేరు రూరల్ : స్థానిక మార్కెట్ యార్డులో వడ్డెర ఓబన్న జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, ఏపీ వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్వ సన్యాధ్యక్షుడిగా వడ్డెర ఓబన్న విశేష సేవలందించారని కొనియాడారు. వడ్డెర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో రూ.10 లక్షల నిధులతో పాటు 75 సెంట్ల స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర నాయకులు తిమ్మయ్య, రమణ, ఎస్.ఎస్.మణి, బాలరాజు, యుగంధర్, ఎ.వి.రమణ, బి.వి.రమణ, రామకృష్ణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

22న రామాలయాల్లో పూజలు

రామసముద్రం : అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముల వారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రతి గ్రామంలోని రామాలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించాలని శ్రీరామ భక్తులు తెలిపారు. గురువారం స్థానిక బజారువీధిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో అన్ని కుల సంఘ పెద్దలతో సమావేశం నిర్వహించారు.